మా భూములు చెరబట్టిండ్రు

- అసైన్డ్ భూములనూ వదలట్లేదు
- దొంగ పత్రాలతో అపర్ణ రియల్ ఎస్టేట్ కంపెనీ దౌర్జన్యం
- మంత్రి పొంగులేటి పేరు చెప్పి బెదిరిస్తున్నరు
- బౌన్సర్లు, సెక్యూరిటీతో దాడులు చేయిస్తున్నరు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే మాకు న్యాయం చేయాలి
- మీడియా ఎదుట కొండకల్ గిరిజనుల గోడు

భూములకు సంబంధించిన కాగితాలను చూపిస్తున్న గిరిజనులు

ఖైరతాబాద్, ఆగస్టు 29 : 'దశాబ్దాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి సాగుచేసుకుంటున్నం. మా అసైన్డ్ భూములను దొంగపత్రాలు సృష్టించి ఆ దొరలు చెరబట్టిండ్రు' అని కొండకల్ తండా గిరిజనులు వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. బాధితులు రవి రాథోడ్, లక్ష్మణ్, శంకర్, మోహన్ తదితరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ తండాలో సర్వే నంబరు 362, 363, 364, 369, 377లో ప్రొటెక్టెడ్ టెనెంట్స్ (పీటీ) భూములను తరతరాలుగా సాగుచేసుకుంటూ జీవిస్తున్నామని చెప్పారు. 1997 నాటి ప్రభుత్వం తమకు భూములను కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చిందని, మొత్తం 200 ఎకరాలు ఉండగా, 80 ఎకరాల్లో 400 మంది సాగు చేసుకుంటున్నట్టు తెలిపారు. అపర్ణ రియల్ ఎస్టేట్ కంపెనీ తమ భూములపై కన్నేసి దొంగ పత్రాలు సృష్టించి కబ్జా చేయడం మొదలు పెట్టిందని వాపోయారు. అసైన్డ్ భూములను కబ్జా చేయడంతో పాటు ప్రహరీ గోడలు కూడా నిర్మించిందని, తాము వ్యవసాయం కోసం భూమి వద్దకు పోతే ఆ సంస్థ బౌన్సర్లు, ప్రైవేట్ సెక్యూరిటీతో తమపై దాడులు చేయిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి పొంగులేటి పేరు చెప్పుకొని కబ్జాదారులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళనచెందారు. ఆయా సర్వే నంబర్లలో మంత్రి పొంగులేటి సతీమణి, కొడుకు పేరిట కూడా భూములు ఉన్నాయని, చాలా భూములు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని వివరించారు. చివరికి శ్మశాన వాటికలోని తమ పూర్వీకుల సమాధులను సైతం ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. బాధ్యులను వదిలి తమపై, స్థానిక యువకులపై శంకర్‌పల్లి, మోకిల పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. తమపై దాడులు చేస్తున్న దుండగులపై మోకిల పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. తమ తండా వాసులకు ప్రాణగండం ఉన్నదని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నేటి నుంచి పెసర కొనుగోలు కేంద్రాలు

- మార్క్‌ఫెడ్‌కు మంత్రి తుమ్మల ఆదేశం
- హరీశ్‌రావు లేఖతో సర్కారులో కదలిక

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచే పెసర కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు క్వింటాకు మద్దతు ధర రూ.8,682 చెల్లించాలని ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో 64,175 ఎకరాల్లో పెసర సాగైందని, 17,841 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పంటకోత దశకు వచ్చిన 12 ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, కొనుగోళ్లను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు ఖమ్మం, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట, నారాయణపేట, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పెసర పంట కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని హరీశ్‌రావు బుధవారమే సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. స్పందించిన మంత్రి తుమ్మల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశించడం గమనార్హం.

అధికారులకు పునరావాస కేంద్రంగా టీజీఐఐసీ

- నిలిచిన భూముల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన
- కాగితాలకే పరిమితమైన కొత్త ఇండస్ట్రియల్ పార్కులు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): పనులు జానెడు.. పనివారు బోలెడు అన్న చందంగా తయారైంది తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) పరిస్థితి. సంస్థలో ఏ ఒక్క అధికారికీ చేతినిండా పనిలేకపోయినా, పోస్టులను సృష్టించి మరీ ఫారిన్ సర్వీసుల కింద అధికారులను భర్తీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిశ్రమలకు అవసరమైన విధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి దరఖాస్తు చేసుకున్నవారికి నిర్ణీత ధరకు భూములు కేటాయించడం టీజీఐఐసీ విధి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి పరిశ్రమలకు భూముల కేటాయింపు, కొత్త ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి పనులు నిలిచిపోగా, ఇతర శాఖల అధికారులకు టీజీఐఐసీ పునరావాస కేంద్రంగా మారిపోయింది. గత బీఆర్‌ఎస్ హయాంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శికితోడు టీజీఐఐసీకి ఒక మేనేజింగ్ డైరెక్టర్, ఒక ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉండేవారు. ఇప్పుడు మరో ముగ్గురు ఉన్నతాధికారులు వచ్చిచేరారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శికి తోడు కార్యదర్శిగా ఒక అఖిల భారత సర్వీసు అధికారిని నియమించారు. అంతేకాదు, టీజీఐఐసీ ఎండీకి కింద సీఈఓ ఉండగానే ఇద్దరు ఎగ్జిక్యూటివ్ అధికారుల(ఈఓ)ను నియమించారు. ఇందులో ఒకరు ఆడిట్ శాఖ నుంచి, మరొకరు ఎక్సైజ్ శాఖ నుంచి ఫారిన్ సర్వీసుల కింద వచ్చారు. టీజీఐఐసీ ఎండీగా గతంలో ఐఏఎస్ అధికారి కొనసాగగా, ఇప్పుడు సెంట్రల్ సర్వీసులకు చెందిన అధికారిని కొనసాగిస్తున్నారు.

పని లేనప్పటికీ..

పరిశ్రమల అభివృద్ధికి మౌలిక సదుపాయాలను కల్పించే టీజీఐఐసీకి చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం, ఆయా రంగాలకు డైరెక్టర్లు, జిల్లాలవారీగా జోనల్ కమిషనర్లు ఉన్నారు. ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, భూముల కేటాయింపునకు జిల్లాలవారీగా జోనల్ అధికారులు, ప్రధాన కారాలయంలో జీఎంలు ఉన్నప్పటికీ వారిపై కొత్తగా ఈడీలను నియమించడం గమనార్హం.

కల్యాణలక్ష్మిపై రాజకీయ కక్ష

- చెక్కులు మంజూరైనా ఇస్తలేరు
- 14,865 మందికి అదే పరిస్థితి
- అత్యధికం ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న చోటే
- పెండింగ్‌లో 86 వేలకు పైగా దరఖాస్తులు
- వెరిఫికేషన్‌పై అధికారుల నిర్లక్ష్యం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం ఇస్తామన్న హామీని అమలు చేయకపోగా, రూ.1,00,016 ఆర్థిక సాయాన్ని అందజేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. చెక్కులు జారీ చేసినా లబ్ధిదారులకు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట ఈ సమస్య తీవ్రంగా ఉన్నది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానమే ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నది. చెక్కులు మంజూరైనా దాదాపు 14,865 మందికి ఇవ్వకుండా పెండింగ్ పెట్టడం గమనార్హం. సర్టిఫికెట్ వెరిఫికేషన్ దశలో మరో 86,483 దరఖాస్తులు పెండింగ్ ఉన్నట్టు ప్రభుత్వమే వెల్లడించింది. క్షేత్రస్థాయిలో 41,887 దరఖాస్తులు, ఆర్డీవోల స్థాయిలో 24,724, ఎమ్మెల్యేల స్థాయిలో 19,872 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న చోట మరీ ఎక్కువ

కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెక్కులను మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం చెక్కుల పంపిణీని సైతం రాజకీయం చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాలకు వచ్చిన దరఖాస్తులను తొలుత తహసీల్దార్, ఆ తరువాత ఆర్డీవో పరిశీలిస్తారు. లబ్ధిదారులను ఎంపిక చేసి చెక్కులను అందజేస్తారు. 14,865 మందికి చెక్కులు మంజూరైనా పంపిణీ చేయకుండా పెండింగ్‌లో పెట్టగా, వీటిలో సగాని కంటే ఎక్కువ 8,918 చెక్కులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలవే కావడం గమనార్హం. బీజేపీ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ చెక్కుల పంపిణీ జరగడం లేదు. మొత్తంగా 11 వేలకుపైగా చెక్కులు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలవే కావడం గమనార్హం. ప్రభుత్వ వివక్షపూరిత పాలనకు సిద్దిపేట జిల్లానే నిదర్శనంగా నిలుస్తున్నది. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. హుస్నాబాద్ డివిజన్‌లో మంత్రి పొన్నం ఎమ్మెల్యేగా ఉండగా, అక్కడ ఒక్క చెక్కూ పెండింగ్ లేదు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్‌లో 561, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలో 744 చెక్కులు పంపిణీ చేయకుండా పెండింగ్ పెట్టారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాలో సైతం ఒక్క చెక్కు కూడా పెండింగ్ లేవు.

పేదింటి తల్లిదండ్రుల అవస్థలు

చెక్కుల పంపిణీ చేయడంలో తీవ్ర తాత్సారం చేస్తుండటంతో పేదింటి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా కల్యాణలక్ష్మి చెక్కులను ఆర్డీవోలు జారీ చేస్తారు. ఆ చెక్కులపై నిర్దేశిత తేదీని వేస్తారు. ప్రస్తుతం చెక్కుల గడువు ముగిసిన తరువాత కూడా పంపిణీ చేయని దుస్థితి నెలకొన్నదని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. చెక్కులను బ్యాంకులకు తీసుకెళ్తే బౌన్స్ అయ్యాయని చెప్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో మళ్లీ చెక్కుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తున్నదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెక్కుల పంపిణీ జాప్యానికి స్థానిక కాంగ్రెస్ నేతలే ప్రధాన కారణమని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట చెక్కులను పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తే.. కాంగ్రెస్ నేతలు ఒత్తిడి తేవడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో అధికారులు సైతం ప్రొటోకాల్‌కు విరుద్ధంగా చెక్కులు పంపిణీ చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న చోట చెక్కులు పెండింగ్ పెట్టాల్సి వస్తున్నదని, దీంతో లబ్ధిదారులు నష్టపోతున్నారని అధికారులు వివరిస్తున్నారు.

10 నెలల నుంచి తిరుగుతున్న..!

మహబూబాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తార్‌సింగ్ తండాకు చెందిన భూక్యా భద్రు- నీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు అనూష డిగ్రీ పూర్తి చేసింది. ఆమెకు 2023 జూన్ 4న ఇల్లందు మండలం మామిడిగుండ్ల గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిపించారు. వివాహం చేసిన రెండు నెలల తర్వాత కల్యాణలక్ష్మి పథకానికి కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకూ చెక్కు రాలేదు. వారానికోసారి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి 'సార్ మా చెక్కు వచ్చిందా?' అని ఆరా తీస్తున్నారు. వెళ్లిన ప్రతిసారీ 'బడ్జెట్ లేదు.. బడ్జెట్ రాగానే మీ చెక్కు వస్తుంది' అని అధికారులు చెప్తున్నారు. వారు దరఖాస్తు చేసి 10 నెలలు కావొస్తున్నది.. ఇప్పటికైనా వీలైనంత త్వరగా తమకు కల్యాణలక్ష్మి చెక్కు ఇప్పించాలని వారు వేడుకుంటున్నారు.

మనుమరాలు వచ్చినా మంజూరు కాలేదు

నేను, నా భార్య మహ్మద్ యాదాంబీ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నాం. మా చిన్న కూతురు మహ్మద్ ఫౌజియా వివాహం గత సంవత్సరం మే 3న చేశాం. షాదీముబారక్ డబ్బులు రాగానే అల్లుడికి కూడా కానుకలు పెడతామని పది మందిలో ఒప్పుకున్నాం. నా బిడ్డ పెండ్లి అయి 16 నెలల గడుస్తున్నది. నా బిడ్డకు ఇటీవల సంతానం కలిగి మాకు మనుమరాలు వచ్చింది. షాదీముబారక్ డబ్బులు మాత్రం రాలేదు. షాదీముబారక్ చెక్కుల కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. గీ ప్రభుత్వం అసలు ఇస్తదో.. లేదోననే గుబులుగా ఉన్నది.

- మహ్మద్ గుంషావలి, రాయపర్తి, వరంగల్

తులం బంగారం ఊసేలేదు

కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,016 నగదుతోపాటు ఆడబిడ్డలకు పెండ్లిరోజునే తులం బంగారం కూడా అందజేస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటివరకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమలయ్యే అవకాశం లేదని బడ్జెట్ కేటాయింపులు సూచిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు సంబంధించి బడ్జెట్‌లో ఈ ఏడాది ప్రభుత్వం రూ.3,855.12 కోట్లు ప్రతిపాదించింది. ఇందులో బీసీలకు రూ.2,185.51 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతగా రూ.725 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా ఆ నిధులే ఇప్పటివరకు పూర్తిగా జమ కాలేదు. ప్రస్తుతం కేటాయించిన నిధులు లక్ష ఆర్థిక సాయానికి మాత్రమే సరిపోతాయని, తులం బంగారాన్ని ఇవ్వాలంటే బడ్జెట్ రెండింతలు చేయాల్సి ఉంటుందని అధికారుల అంచనా.

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

- సెప్టెంబర్ 6 నుంచి ఓటరు అభ్యంతరాల స్వీకరణ
- అదే నెల 21న తుది ఓటరు జాబితా ప్రకటన
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి వెల్లడించారు. ఎన్నికల నిర్వహణపై గురువారం కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, జిల్లా, డివిజనల్ పంచాయతీ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా ముసాయిదా నోటిఫికేషన్‌ను వెలువరించి అభ్యంతరాలను స్వీకరించాలని, సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో అన్ని స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయనున్నట్టు ప్రకటించారు. తొలుత మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డు పరిధిలో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓట్లు ఒకేచోట ఉండేలా జాబితాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా 'గ్రీవెన్స్ మాడ్యూల్'ను పార్థసారథి ఆవిష్కరించారు. సమీక్షలో పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, ఎన్నికల సంఘం అధికారులు పాల్గొన్నారు.

నేడు దేవాదుల ప్రాజెక్టుకు మంత్రులు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సందర్శించనున్నారు. సహచర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఉదయం 9 గంటలకు తుపాకులగూడెంలోని పంపింగ్ సైట్‌కు చేరుకుంటారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై అక్కడే సంబంధిత ఇంజినీర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

ఈ ఏడాదిలో అత్యధిక విద్యుత్తు డిమాండు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2024-25లో 15,573 మెగావాట్లతో అత్యధిక విద్యుత్తు డిమాండు (పీక్) నమోదైనట్టు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో 14,816 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదైనట్టు చెప్పారు. నిరుడుతో పోల్చుకుంటే ఇది 5.11శాతం అధికమని పేర్కొన్నారు. ఈ ఏడాది అత్యధిక పీక్ డిమాండ్ 15,623 మెగావాట్లతో మార్చి 8న నమోదైందని చెప్పారు. మార్చి 14న అత్యధికంగా 308.54 మిలియన్ యూనిట్లు సరఫరా చేసినట్టు తెలిపారు. ఆగస్టులో ఈరోజు వరకు సగటున 266.14 మిలియన్ యూనిట్లు సరఫరా చేయగా నిరుడు ఇదే సమయంలో 250.25 మిలియన్ యూనిట్లు సరఫరా చేసినట్టు వెల్లడించారు. ఈ ఏడాది విద్యుత్తు సరఫరా 6.35శాతం అధికమని తెలిపారు. ఖరీఫ్‌లో 17,000 మెగావాట్ల అవసరమున్నా సిద్ధంగా ఉన్నట్టు వివరించారు.

గణేశ్ మండపాలకు ఉచిత కరెంట్

- నిర్వాహకులు నిబంధనలు పాటించాలి : సీఎం
- ఉత్సవాల నిర్వహణపై సచివాలయంలో సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ తొలినుంచి మతసామరస్యానికి, ప్రశాంతతకు మారు పేరని, దాన్ని మరింత ఇనుమడింపజేసేలా గణేశ్ ఉత్సవాలను నిర్వహించాలని ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ నిర్వహణపై బుధవారం ఆయన సచివాలయంలో సమీక్షించారు. రెండు పండుగలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం తరపున పోలీసు, జీహెచ్‌ఎంసీ, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల, విద్యుత్తు శాఖలతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మండప నిర్వాహకులు ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలన్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారు. ఉచిత విద్యుత్తుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విద్యుత్తును వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల్లో డీజేలు వాడేందుకు అనుమతివ్వాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కోరగా, సుప్రీం కోర్టు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

సిటీ ఎమ్మెల్యేలు ఏరి?

సీఎం నిర్వహించిన సమీక్షలో జీహెచ్‌ఎంసీ పరిధి ఎమ్మెల్యేలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, అరెకపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్ వంటివారిని సమావేశానికి పిలవకపోవడం గమనార్హం. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని పోలీసులను సీఎం ఆదేశించారు. సీఎంకు, సిటీ ఎమ్మెల్యేలకు మధ్య గ్యాప్ పెరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

19న మిలాద్-ఉన్ నబీ ప్రదర్శనలు

సెప్టెంబరు 19న మిలాద్-ఉన్-నబీ ప్రదర్శనలు నిర్వహించుకునేందుకు మిలాద్ కమిటీ ప్రతినిధులు అంగీకరించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 16న వేడుకలు నిర్వహించాలని కమిటీ తొలుత నిర్ణయించింది.

సెప్టెంబరు 7నుంచి గణేశ్ నవరాత్రోత్సవాలు, 17న నిమజ్జనం విషయం సీఎం సమీక్షలో చర్చకు వచ్చింది. దీంతో మిలాద్ ఉన్ నబీ ప్రదర్శనలను వాయిదా వేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం, మంత్రులు సూచించగా మిలాద్ కమిటీ సభ్యులు సానుకూలత వ్యక్తం చేశారు.

547మంది ఎస్సై అభ్యర్థుల శిక్షణ పూర్తి

- బీఆర్‌ఎస్ హయాంలోనే నియామకాలు
- సెప్టెంబర్‌లో పాసింగ్ అవుట్ పరేడ్

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ హయాంలో నియామకమైన 547మంది ఎస్సై శిక్షణార్థులు మరో పది రోజుల్లో తమ పాసింగ్ అవుట్ పరేడ్‌ను నిర్వహించనున్నారు. 2022 ఏప్రిల్‌లో 17,516 పోలీసు ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు నోటిఫికేషన్లు విడుదల చేసింది. వాటిల్లో 16,929 కానిస్టేబుల్, 587 ఎస్సై పోస్టులు ఉన్నాయి. ఎస్సై పోస్టులకు విజయవంతంగా పలు దశల్లో ప్రిలిమినరీ టెస్టు, ఫిజికల్ ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించి గతేడాది ఆగస్టులోనే తుది ఫలితాలు వెల్లడించి వెంటనే సెప్టెంబర్‌లో శిక్షణకు ఆహ్వానించారు. వీరికి రాష్ట్ర పోలీసు అకాడమీలో ఇండోర్, అవుట్‌డోర్ విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. సివిల్ అభ్యర్థులకు 12నెలలు, ఏఆర్ అభ్యర్థులకు 10నెలలు, టీఎస్‌ఎస్పీ అభ్యర్థులకు 9నెలలు శిక్షణ ఇవ్వగా.. షెడ్యూల్ ప్రకారం అన్నీ ఈ సెప్టెంబర్‌లోనే ముగిసేలా పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ చర్యలు తీసుకున్నారు. మహిళా అభ్యర్థులకు సైతం ఇక్కడే శిక్షణ ఇచ్చారు. వారికి ప్రత్యేకంగా హాస్టళ్లు, మెస్ వసతి కల్పించారు. మొత్తం 587 మందిని ఎంపిక చేయగా.. శిక్షణకు ముందే కొందరు అన్‌విల్లింగ్ అని వివిధ ఉద్యోగాలకు వెళ్లిపోగా, ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాలతో మరికొందరు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఇంకొందరు శిక్షణను వదిలి వెళ్లగా.. ప్రస్తుతం 547 మంది శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరిలో సివిల్ 401, ఏఆర్ 83, టీజీఎస్పీ 29, ఫింగర్ ప్రింట్ 9, ఐటీ అండ్ కమ్యూనికేషన్ 22, పీటీఓ 3 ఉన్నారు. పోలీసు అకాడమీలో నిర్వహించే పాసింగ్ అవుట్ పరేడ్‌కు సీఎం, మంత్రులు రానుండడంతో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు డీజీ అభిలాష బిష్త్ తెలిపారు. రెండ్రోజుల క్రితం పోలీసు అకాడమీ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఆ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

- అఫిలియేషన్ పొందని 340కి పైగా కాలేజీలు
- గుర్తింపు లేకుండా నడుస్తున్నా మూసివేయని బోర్డు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ జంజాటం.. ఇంటర్‌బోర్డు గుర్తింపునివ్వకపోవడం వంటి సమస్యలతో 340కి పైగా కాలేజీల్లోని విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుంది. గుర్తింపు లేని కాలేజీల్లో చదివితే పరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోనుండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరం కానుంది. ఆయా కాలేజీలు ఇప్పటివరకు ఇంటర్‌బోర్డు గుర్తింపును దక్కించుకోలేదు. కానీ కాలేజీల్లో అడ్మిషన్లు నిర్వహించి, విద్యార్థులను చేర్చుకుని, క్లాసులు కూడా నిర్వహిస్తున్నాయి. వాస్తవికంగా ఇంటర్‌బోర్డు గుర్తింపు జారీ అయిన తర్వాతే ఆన్‌లైన్ లాగిన్ ఐడీ ఇస్తారు. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తేనే వార్షిక పరీక్షల ఫీజు చెల్లించే వీలుంటుంది. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు హాజరుకావొచ్చు. కానీ ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా కాలేజీ అఫిలియేషన్‌లో పురోగతి లేకపోడం ఆందోళనకరంగా మారింది. సంబంధిత కాలేజీ అగ్నిమాపకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ)ను ఇంటర్‌బోర్డుకు సమర్పిస్తేనే అధికారులు అనుబంధ గుర్తింపు జారీచేస్తారు. ఎన్‌వోసీ పొందలేక, పలు కాలేజీలు ఈ ఏడాది ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపును పొందలేకపోయాయి. కాగా గత కేసీఆర్ సర్కారు జీవో- 29 అమలును నిలుపుదల చేసి (అబయన్స్‌లో ఉంచి) అనుబంధ గుర్తింపునకు అవకాశానిచ్చింది. 2021 నుంచి 24 వరకు మినహాయింపునిచ్చింది. అయితే 2023 - 24 తర్వాత ఎట్టి పరిస్థితుల్లో మినహాయింపు నివ్వమని అప్పట్లోనే ఆయా జీవోలో పేర్కొన్నారు. అయినా కాలేజీల యాజమాన్యాలు దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. సెప్టెంబర్ సమీపిస్తున్నా ఇంతవరకు అఫిలియేషన్‌ను దక్కించుకోలేదు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. ఇదే అంశంపై ఇంటర్‌బోర్డు డైరెక్టర్ శృతి ఓజాను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు.

బషీర్‌బాగ్ 'లా' కాలేజీకి ఇంకా అఫిలియేషన్ రాలె!

బషీర్‌బాగ్ లా కాలేజీ.. ఓయూకు అనుబంధంగా నడుస్తున్న ప్రముఖ కాలేజీ. ఇంతటి ప్రముఖమైన కాలేజీ ఈ విద్యాసంవత్సరంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపును దక్కించుకోలేదు. ఈ కాలేజీతో పాటు ఖమ్మంలోని మానేరు కాలేజీ సైతం గుర్తింపు పొందలేదు. దీంతో ఈ రెండు కాలేజీలను మొదటి విడత లాసెట్ వెబ్‌ఆప్షన్ల జాబితాలో అధికారులు పొందుపరచలేదు. చివరి నిమిషంలో కొన్ని కాలేజీలు గుర్తింపును దక్కించుకోవడంతో లాసెట్ వెబ్‌ఆప్షన్ల గడువును 30 వరకు పొడగించినట్టు లాసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. 1న సీట్లను కేటాయిస్తామని, 2 నుంచి 6 వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

83 మంది డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి

హైదరా బాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో 83 మం ది డిప్యూటీ తహసీల్దార్లకు ప్రభుత్వం తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించింది. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీజీటీఏ కృషి ఫలితంగానే పదోన్నతులు లభించాయని అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పదోన్నతులకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్, సెక్రెటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ ఓ ప్రకటన విడుదల చేశారు.

ఇంజినీరింగ్ సీట్ల పెంపును ఎందుకు నిరాకరిస్తున్నారు?

- కారణాలు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సీట్ల పెంపు, కుదింపు, కొత్త కోర్సులు ప్రారంభించే అంశంపై అనుమతులు నిరాకరించడానికి కారణాలు చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏఐసీటీఈ, యూనివర్సిటీలు అనుమతి ఇచ్చిన తర్వాత ఉన్నత విద్యా శాఖ ఎందుకు అనుమతి ఇవ్వడం లేదో చెప్పాలని ప్రశ్నించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 4కు వాయిదా వేసింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, సాంకేతిక విద్య కమిషనర్, జేఎన్టీయూ, ఏఐసీటీఈ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఈఏపీసెట్ కన్వీనర్లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్త కోర్సుల ప్రారంభం, సీట్ల పెంపు, కుదింపు, కోర్సుల విలీనం రద్దుకు అనుమతి నిరాకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోను, అనుమతులకు చెందిన సాంకేతిక విద్యాచట్టంలోని 20వ సెక్షన్‌ను సవాలు చేస్తూ మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి, అనురాగ్, సీఎంఆర్‌తోపాటు పలు కాలేజీలు విడివిడిగా 11 కేసులు దాఖలు చేశాయి. సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ, కంప్యూటర్ సైన్స్ కోర్సుకు డిమాండ్ ఉన్నదని, ఆ కోర్సు, దాని అనుబంధ కోర్సుల్లో సీట్ల పెంపునకు జేఎన్టీయూ నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) ఇచ్చిందని వివరించారు.